సాక్షి
వికారాబాద్
సోమవారం । 27 । మార్చి । 2023



శ్రీరామ నవమికి సర్వం సిద్ధం
శ్రీరామ నవమికి జుంటుపల్లి రామస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ నెల 29 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. 8లో▸



రైతు పక్షపాతి కేసీఆర్
దేశానికే రాష్ట్రం దిక్సూచిలా మారిందని, సంక్షేమ పథకాలు ఆదర్శంగా మారాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



'పది'పై ప్రత్యేక దృష్టి
పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధించే దిశగా విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 9లో▸



న్యూస్‌రీల్

నేడు లబ్ధిదారుల ఎంపిక

వికారాబాద్ అర్బన్: మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం సోమవారం లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాల కోసం ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుదారుల ఎంపిక మధ్యాహ్నం 3 గంటలకు కార్యాలయంలో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటామని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చింత మణిపట్నం గ్రామానికి చెందిన సాయిరెడ్డికి రూ.28 వేలు, మొగులప్పకు రూ.44 వేలు, సంగెంకలాన్ గ్రామానికి చెందిన గుండప్పకు రూ.60 వేలు, మిట్టబాసుపల్లికి చెందిన జంగం చంద్రకళకు రూ.50 వేల చెక్కులను ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు వడ్డె శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, మేఘనాథ్‌గౌడ్ ఉన్నారు.

తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా శంకర్‌సింగ్

ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ శాఖ

తాండూరు: మున్సిపల్ కమిషనర్‌గా శంకర్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్‌సింగ్‌ను తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. ఉత్తర్వులు అందుకున్న శంకర్‌సింగ్ ఆదివారం తాండూరు మున్సిపాలిటీని సందర్శించారు. కార్యాలయంలో కొంతసేపు గడిపారు. తర్వాత తిరిగి వెళ్లారు. ఈనెలాఖరులో బాధ్యతలు చేపడతానని తెలిపారు. మరోవైపు నాలుగునెలల క్రితం తాండూరు కమిషనర్‌గా ప్రభుత్వం అర్షిత్‌కుమార్‌ను నియమించింది. బాధ్యతలు స్వీకరించకుండానే తిరిగి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కమిషనర్‌గా శంకర్‌సింగ్ బాధ్యతలు చేపడతారా లేదా అనేదానిపై పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ కమిషనర్ పోస్ట్ రెండున్నరేళ్లుగా ఖాళీగా ఉంది.

ఆడుకుంటూ వెళ్లి చెరువులో పడిన బాలిక

దోమ మండలంలో విషాదం


బాలిక మృతదేహం

దోమ: స్నేహితులతో ఆడుకుంటూ వెళ్లి చెరువులో పడి బాలిక మృతిచెందింది. ఈ విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దోమ మండలం కొండాయపల్లికి చెందిన మంజుల, మొగులయ్య దంపతుల కూతురు ఆరాధ్య(5) ఎప్పటిలాగే స్నేహితులు కలసి గ్రామంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో ఆడుకోవడానికి వెళ్లింది. ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు బాలిక చెరువులో పడిపోయింది. అక్కడే ఉన్న తోటి స్నేహితులు గమనించి వెంటనే స్థానికులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానికులు హుటాహుటిన మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ బాలిక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు చెరువులో పడి మృతి చెందడంతో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి.

5 నుంచి చిట్లపల్లి జాతర

కొడంగల్: చిట్లపల్లి సమీపంలో వెలిసిన అబ్దుల్ సాహెబ్ గంధం ఉత్సవాలు వచ్చే నెల 5 నుంచి ప్రారంభమవుతాయి. కొడంగల్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న అబ్దుల్ సాహెబ్ దర్గా సత్యానికి మారుపేరుగా నిలుస్తోంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి.

రథోత్సవంపై రమణీయమూర్తి

కొడంగల్: మలయప్ప స్వామి రథంపై ఉభయ దేవేరుల సమేత స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారి రథోత్సవానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని రథంపై ఊరేగించారు. రాత్రి అశ్వవాహనంపై స్వామివారు ఊరేగారు.

నేడు చక్రస్నానం

సోమవారం ఉదయం 9 గంటల నుంచి స్వామివారి పల్లకీ ఉత్సవం, చక్రస్నానం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయ ఆవరణలోని కోనేరులో స్వామివారికి స్నానం ఆచరిస్తారు. అనంతరం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

జాతర స్థలంలో ఆదివారం ఎద్దులతో బండలాగుడు పోటీలు నిర్వహించారు. 10 క్వింటాళ్ల బరువు గల బండను ఎద్దులతో లాగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులు బల ప్రదర్శనలో పాల్గొన్నాయి. పోటీల్లో మొదటి, రెండో, మూడో స్థాయిలో నిలిచిన వారికి దాతలు బహుమతులు అందజేశారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఎద్దుల బల ప్రదర్శనను తిలకించారు.


రథంపై నుంచి భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

మళ్లీ కలకలం.. అప్రమత్తతతో పదిలం

- కరోనా నేపథ్యంలో మాస్కు తప్పనిసరి
- టెస్టుల కోసం కిట్లు కూడా సిద్ధం చేశాం
- జిల్లాలో ఫస్ట్, సెకెండ్, బూస్టర్ డోస్‌లు 90 శాతం పూర్తిచేశాం
- 'సాక్షి'తో జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్


పల్వాన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

వికారాబాద్: 'జిల్లాలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రజలు భయాందోళనకు గురికావొద్దు. అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటిస్తే చాలని' జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్ సూచిస్తున్నారు. అనుమతులు లేని ఆస్పత్రులు, ల్యాబ్‌లు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లీనిక్‌లపై కొరడా ఝుళిపించిన పల్వాన్‌కుమార్ వైద్యారోగ్య శాఖలో మార్పులు తీసుకురావటానికి కృషి చేస్తున్నారు. పేదలకు వైద్యం చేరువ చేస్తున్న ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలన్నీ ఆయన మాటల్లోనే..

వైద్య సేవల వేళ టెస్టులు..

ప్రత్యేకంగా కరోనా టెస్టులు చేయనప్పటికీ సర్జరీలు తదితర వైద్య సేవల సమయంలో ముందుగా ఈ టెస్టులు చేస్తున్నాం. ఇలాంటి సమయంలోనే జిల్లాలో ఇటీవల రెగ్యులర్‌గా ఒకటి రెండు కేసులు నమోదవుతున్నాయి. పాజిటివ్ కేసులను ఇంకొకరికి సోకకుండా ప్రత్యేకంగా ట్రీట్ చేయడం అవసరం. కానీ కరోనా అనే కారణంతో వైద్యం నిరాకరించడం లాంటివి చేయొద్దు. అలా చేస్తే చర్యలు తీసుకుంటాం. గతంలో కరోనా సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించామో అందరికీ అవగాహన ఉంది. మానసికంగా ధైర్యంగా ఉండాలి. మాస్కులు వాడటం, శానిటైజర్ వంటివి ప్రజలు అలవాటు చేసుకోవాలి. ఇవి దిన చర్యలో భాగం కావాలి.



అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

కరోనాను ఎదుర్కొనేందుకు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు వైద్యారోగ్య శాఖ పరంగా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నాం. కరోనా టీకాల విషయంలో ఫస్ట్, సెకండ్ డోస్‌లతో పాటు బూస్టర్ డోస్ వరకు జిల్లాలో 90 శాతం పూర్తి చేశాం. ఈ విషయంలో రాష్ట్రంలో మన జిల్లా టాప్ ఫైవ్‌లో ఉంది. కరోనా విషయంలో అవలంబించాల్సిన వ్యూహాలపై వైద్యులు, వైద్య సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు వారికి అవసరమైన సలహాలు సూచనలు అందజేస్తున్నాం. టెస్టుల కోసం ఎవరైనా వస్తే చేసేందుకు కిట్లు కూడా అందుబాటులో ఉంచాం. ఇమ్యునైజేషన్, ఇనిస్టుట్యూషనల్ (ఆస్పత్రులలో ప్రసవాలు) డెలవరీలు, ప్రభుత్వ ల్యాబ్‌లలో టెస్టుల నిర్వహణ, ఏఎస్‌సీ, పీఎన్‌సీ చెకప్‌లు, కరోనా టీకాలు వేయటం తదితర అన్ని రకాల సేవల్లో జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలోపే ఉంది. సగానికి పైగా సేవల్లో ఒకటి, రెండు, మూడు స్థానాల్లో కూడా ఉంది.

రౌండ్‌దీ క్లాక్ ఆస్పత్రులన్నింటిలో కాన్పులు

జిల్లాలో మొత్తం 24 ప్రాథమిక (పీహెచ్‌సీ) ఆరోగ్య కేంద్రాలు, 134 సబ్ సెంటర్లు ఉన్నాయి.. ఇందులో ఏడు రౌండ్‌దీ క్లాక్ (24 గంటలు పని చేసే) పీహెచ్‌సీలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రితో పాటు రౌండ్‌దీ క్లాక్ పీహెచ్‌సీలన్నింటిలో కాన్పులు చేస్తున్నాం. హైరిస్క్ కేసులుంటే జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నాం. ఈ ప్రభుత్వం ద్వారా సేవలందిస్తున్న ఇనిస్టుట్యూషనల్ అన్నింటిలో వైద్యులు, వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం..

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జిల్లాలో ఉన్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఇప్పటికే ఆర్‌ఎంపీ, పీఎంపీలతో పాటు అనుమతులు లేకుండా నిర్వహించే ప్రైవేటు, ఆస్పత్రులు, క్లీనిక్‌లకు నోటీసులు ఇచ్చాం. ఆర్‌ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ లాంటివి చేస్తే ఏ సమస్య ఉండదు. కానీ వారి పరిధి దాటి వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితిల్లోనూ ఉపేక్షించం. సెలైన్లు పెట్టడం, బెడ్లు వేసి వైద్యం చేయటం లాంటివి చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మటం లాంటివి ఎవరు చేయకూడదు. వైద్యులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా అర్థమయ్యేలా ప్రిస్క్రిప్షన్ రాయాలి.

ప్రభుత్వ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవటంతో పాటు అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రజలు ప్రధానంగా గ్రామీణ ప్రాంత పేదలు ప్రభుత్వ ల్యాబ్‌లను వినియోగించుకోవాలి. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ల్యాబ్‌లో దాదాపు 48 రకాల టెస్టులు చేసుకునేందుకు వీలుంది. ఇవన్నీ ఫ్రీగానే చేస్తారు. ప్రజలు టెస్టుల కోసం జిల్లా కేంద్రానికి కూడా రావాల్సిన పనిలేదు. వారికి అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలలో రక్త నమూనాలు ఇస్తే టెస్టులు నిర్వహించి ఫోన్ ద్వారా రిజల్టు అందజేస్తున్నాం. దీన్ని ప్రజలు వినియోగించుకోవాలి.

జోరుగా సుద్ద దందా!

- యథేచ్ఛగా తవ్వకాలు
- మూడేళ్లుగా లీజులు నిలిచినా ఆగని అక్రమ మైనింగ్
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు


పెద్దేముల్ మండలంలోని సుద్ద గనిలో చేపట్టిన తవ్వకాలు

పెద్దేముల్: సుద్ద తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. లీజులు లేకుండానే రాత్రి, పగలు నిర్విరామంగా తవ్వేస్తున్నారు. దృష్టిసారించాల్సిన మైన్స్, రెవెన్యూ అధికారులు పత్తాలేకుండా పోయారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సులభతర వాణిజ్యంలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో నిలుస్తోంది. జిల్లాలో సుద్దతో పాటు నాపరాతి, ఎర్రమట్టి నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వం రాయల్టీ ధరలు పెంచడంపై చూపిస్తున్న శ్రద్ధ కొత్త లీజులపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. సుమారు మూడేళ్ల నుంచి సుద్ద తవ్వకాలకు లీజులు నిలిచిపోయినా అక్రమ మైనింగ్ జోరుగా సాగుతుండటం గమనార్హం. ప్రభుత్వం రాయల్టీ, డెడ్ రెంట్, సెక్యూరిటీ పేరుతో రెండింతలు ధరలు పెంచడంతో సుద్ద వ్యాపారులు కొత్త లీజులపై ఆసక్తి చూపడం లేదు. సుద్ద వ్యాపారస్తులు పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని సులైపేట, కొడిల్లి, సూరూరు ప్రాంతాలకు వెళ్లి సుద్ద తవ్వకాలు జరుపుతున్నారు. కొన్నేళ్లుగా ముడి సుద్ద (బెంటోనైట్) దేశ విదేశాలకు ఎగుమతి అవుతోంది.

ఈ మండలాల్లో నిక్షేపాలు అధికం

పెద్దేముల్, ధారూరు, మోమిన్‌పేటతో పాటు పలు ప్రాంతాలల్లో సుద్ద నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. సుమారు 20 ఏళ్లుగా సుద్ద విదేశాలకు సరఫరా అవుతోంది. మూడేళ్లుగా ప్రభుత్వం కొత్త మైనింగ్ లీజులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సుద్ద మైనింగ్ వ్యాపారస్తులకు సుద్ద లభించక ఇబ్బందిగా మారింది. ఉన్న లీజులకు కాల పరిమితి ముగిసిపోవడం, కొత్త లీజులు ప్రభుత్వం సకాలంలో మంజురు చేయకపోవడంతో సుద్ద వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున గండి పడుతోంది. వ్యాపారులు అక్రమ మైనింగ్‌కు తెరలేపడమే ఇందుకు కారణం. ప్రస్తుతం లీజులు అందక కర్ణాటక రాష్ట్రంలో ఉన్న సుద్ద ఇక్కడికి తీసుకరావాల్సిన పరిస్థితిలు ఎదురవుతున్నాయని సుద్ద పరిశ్రమల యజమానులు అంటున్నారు.

కర్ణాటక రాష్ట్రానికి పరుగులు

కర్ణాటక రాష్ట్రంలో మైనింగ్‌కు లీజులు సులభంగా మంజురు కావడంతో ఇక్కడి వ్యాపారులు కర్ణాటక రాష్ట్రానికి పరుగులు పెడుతున్నారు. మరో వైపు సుద్ద నిక్షేపాలు ఉన్న భూముల ధరలు తక్కువ ఉండటంతో కర్ణాటక భూములపై ఎగబడుతున్నారు. తెలంగాణలో ఎకరకు రూ.40 నుండి 60లక్షల వరకు ధర పలకగా, కర్ణాటక రాష్ట్రంలో రూ.6నుంచి రూ.12లక్షల వరకు సుద్ద భూములకు ధరలు తక్కువ ఉండటంతో అక్కడికి వెళుతున్నారు. కాగా కర్ణాటక సుద్ద నాణ్యత విషయంలో తక్కుడ ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

అధికారుల అండదండలతో..

అధికారుల అండదండలతోనే ప్రతి యేటా డిసెంబర్, జనవరి మాసంలోనే అక్రమార్కులు మైనింగ్ చేసి దండుకుంటున్నారు. రుద్రారం, గోపాల్‌పూర్, మారేపల్లి, ఇందోల్ గ్రామాలల్లో అక్రమ మైనింగ్ ఆగడం లేదు. అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.


> **కొత్త జీఓ ప్రకారమే..**
>
> రాయల్టీ, డెడ్‌రెంట్, గనుల లీజుకోసం దరఖాస్తు చేసుకునేందుకు ధరలు పెరిగాయి. గతంలో టన్ను సుద్దకు సుమారు రూ.204 వరకు ఖర్చు అవగా ప్రస్తుతం రూ.400లు, డెడ్ రెంట్ రూ.20,500కు బదులు రూ.41,000, కొత్త గనుల దరఖాస్తు గతంలో సుమారు రూ.15వేలు ఉండగా రూ.లక్ష వరకు పెరిగినట్లు కొత్త జీవో వచ్చింది. ప్రస్తుతం రాయల్టీ అవసరం ఉంటే కొత్త జీవో ప్రకారం చేపట్టవలసి ఉంటుంది.
>
> – సాంబశివరావు, ఏడీ మైన్స్ తాండూరు

సీసీ రోడ్ల పనులు త్వరగా పూర్తిచేయండి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశం

వికారాబాద్ అర్బన్: ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం పనులన్నీ వచ్చే మూడు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగతా పనులు కూడా రెండు మూడు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంజూరైన పనులన్నింటికీ వెంటనే ఎఫ్టీఓలు అప్‌లోడ్ చేయాలన్నారు. నిధులన్నీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పద్య పోటీల్లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థి శివప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది

కొడంగల్ రూరల్: రాష్ట్ర స్థాయి పద్య ప్రస్థానం పోటీల్లో స్థానిక జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటి ద్వితీయ బహుమతి సొంతం చేసుకున్నాడు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి సి.శివప్రసాద్ హైదరాబాద్‌లోని ఆగాఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పద్య ప్రస్థానం పోటీల్లో ప్రతిభ చాటాడు. ఆగాఖాన్ తెలుగుశాఖ ఆధ్వర్యంలో జరిగిన శతక, భాగవత పద్యాల పోటీల్లో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రతిభ చాటడం ఆనందంగా ఉందని బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య బట్టు, ప్రిన్స్‌పాల్ శంకర్‌బాబు, కార్యదర్శి బుర్ర వెంకటేశం, ఆర్‌సీఓ యాదయ్యగౌడ్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణ శివారులోని బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌బాబు, తెలుగు ఉపాధ్యాయులు అక్కి శ్రీనివాసమూర్తి, ఎం.లక్ష్మణ్‌లతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థి శివప్రసాద్‌ను సత్కరించి అభినందించారు.

దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్రం

- ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ తగదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

అనంతగిరి: దేశ సంపదను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా వ్యాపార వేత్తలు అదానీ, అంబానీలకు దోచి పెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు సాగర్, వెంకటరాములు ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జనచైతన్య యాత్ర ఆదివారం వికారాబాద్ పట్టణానికి చేరుకుంది. యాత్రకు సంఘీభావంగా కొత్తగడి నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తక్షణం ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. పేదలకు రుణమాఫీ చేయాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ దిగ్గజాలకు మాఫీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిత్యావసరాలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. గ్యాస్ ధర పెంచి పేదల జీవితాల్లో ఆర్థిక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల తరఫున సీపీఎం ఎల్లవేళలా పోరాడుతుందన్నారు. జిల్లాలో అనంతపద్మనాభ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఎంఎంటీఎస్ రైలును వికారాబాద్ వరకు పొడిగించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జిలను వెంటనే పూర్తి చేయాలన్నారు. అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలన్నారు. ప్రజా ఉద్యమాలతో ప్రజలపక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, మైపాల్, శ్రీనివాస్, బుగ్గప్ప, సుదర్శన్, సత్యనారాయణ, వెంకట్రాములు, అశోక్, మంగమ్మ, చంద్రయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

మతోన్మాద పార్టీని తరిమికొట్టాలి

పరిగి: మతోన్మాద పార్టీ అయిన బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ అన్నారు. సీపీఎం నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్ర ఆదివారం పరిగి పట్టణానికి చేరుకుంది. పట్టణ కేంద్రంలో ఎర్రజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. గ్యాస్ ధర, నిత్యావసర సరుకుల ధరలు పెంచి నిరుపేదల నడ్డివిరుస్తోందన్నారు. పెరిగిన ధరలకు, చేసిన కూలీకి సంబంధం లేకుండా పోయిందన్నారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలన్నారు.


వికారాబాద్ పట్టణంలో సీపీఎం నాయకుల బైక్ ర్యాలీ

క్లుప్తంగా

31న కలెక్టరేట్ ముట్టడి

అనంతగిరి: ఈనెల 31న మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ తెలిపారు. ఈమేరకు ఆదివారం వికారాబాద్ నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధిస్తేనే ఎస్సీ ఉపకులాలకు విద్య, ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు వస్తాయన్నారు. బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ హామీని విస్మరిస్తుందన్నారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం వర్గీకరణ సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నారన్నారు. జిల్లాలో జరిగే కార్యకర్తలు, యువకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు మల్లికార్జున్, రవి, ప్రకాష్, జగన్, శేఖర్, కృష్ణ, స్వామి దాసు, మహేందర్, ఆనందరం పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం



శిశువును కుటుంబసభ్యులకు అందజేస్తున్న 108 సిబ్బంది నరేష్


కుల్కచర్ల: 108లో మహిళ ప్రసవించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రాంసింగ్ నాయక్ తండాకు చెందిన సంగీతకు ఆదివారం తెల్లవారుజామున పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. వారు సంగీతను కులకచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది నరేష్ తెలిపారు.

నిరంకుశ పాలనపై పోరాటం

షాద్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందని టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ లోకసభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం షాద్‌నగర్‌లో కాంగ్రెస్ నేతలు ప్రధాన మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో జాతీయ పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన వ్యక్తిపై బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కోర్టు తీర్పు ప్రకటించిన వెంటనే అనర్హత వేటు వేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలందరూ రాహుల్ గాంధీ వెంటే ఉన్నారని, అవసరం అయితే ఏ త్యాగానికైనా తాము సిద్ధమని అన్నారు. అనర్హత వేటుపై కాంగ్రెస్ పార్టీ న్యాయ పోరాటం చేస్తుందన్నారు. గాంధీ కుటుంబానికి పదవులు ముఖ్యం కాదని, ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతోందన్నారు. దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారి గురించి రాహుల్‌గాంధీ మాట్లాడితే బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని పేర్కొన్నారు. దేశ సమైక్యత కోసం అన్ని వర్గాలను ఏకం చేసేందుకు ఇటీవల రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రకు మంచి స్పందన లభించిందన్నారు. దీన్ని చూసి ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

శ్రీరామ నవమికి సర్వం సిద్ధం

- బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన జుంటుపల్లి రామస్వామి ఆలయం
- 29 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ



ఆలయంలో కొలువైన సీతారామలక్ష్మణులు



ముస్తాబైన జుంటుపల్లి రామస్వామి ఆలయం

యాలాల: శ్రీరామ నవమి పర్వదినానికి మండలంలోని జుంటుపల్లి రామస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. తాండూరు నియోజకవర్గంలో జరిగే పెద్ద ఉత్సవాల్లో శ్రీరామ నవమి వేడుక ఒకటి. ఇందుకోసం ఆలయ కమిటీ, గ్రామస్తులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు.

బ్రహ్మోత్సవాల వివరాలు...

మొదటి రోజు బుధవారం(29న) ఉదయం 10.15 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి పది గంటలకు ఎదుర్కోలు నిర్వహిస్తారు. 30 తేదీ గురువారం ఉదయం 11.55 నిమిషాలకు శ్రీవారి కల్యాణం, రాత్రి 9.55 నిమిషాలకు విమాన రథోత్సవం, 31వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు వసంతోత్సవం, పెరుగు బసంతం, శేష వాహన సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. చివరి రోజు ఏప్రిల్ 1 శనివారం మహాలక్ష్మి పూజ, హరికథ కాలాక్షేపం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాలకు తాండూరు నుంచి జుంటుపల్లి వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడవనున్నాయి. ఉత్సవాలకు యాలాలతో పాటు పెద్దేముల్, బషీరాబాద్, కోడంగల్, తాండూరుతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

ఆలయ చరిత్ర...

జుంటుపల్లికి చెందిన యాదవ వంశస్తులు, వెంకట కృష్ణ ఉద్దండరావు పశువుల కాపరిగా ఉండేవారు. ఇక్కడి కొండలపై వారు నివాసముండేవాడు. జాగీర్ల పాలనలో కూడా త్రికాల పూజలు చేస్తూ ప్రజలకు సేవ చేసేవారు. ఒకరోజు మేడి చెట్టుకింద నిద్రిస్తుండగా, సీతారాములు వారి కలలోకి వచ్చి ఇక్కడ ఆలయం నిర్మించాలని ఆదేశించారు. నిద్ర నుంచి లేచిన వెంకటకృష్ణారావు ముఖం కడుక్కోవడానికి సమీపంలోని కోనేటికి వెళ్లాడు. కోనేరులో నీటిని దోసిళ్లలోకి తీసుకోగా చేతిలోకి విగ్రహం వచ్చింది. ఇలా మూడుసార్లు విగ్రహాలు వచ్చాయి. ఈ విషయాన్ని తన తమ్ముడు రంగారావుకు వివరించాడు. అవి సీతారామలక్ష్మణుల విగ్రహాలుగా గుర్తించారు. అయితే అదే సమయంలో అటువైపుగా వెళుతున్న ఒక మహర్షి మందిర నిర్మాణానికి ఆశీస్సులు ఇచ్చి అదృశ్యమయ్యాడు. వెంటనే అన్నదమ్ములిద్దరూ ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. అనుమతి లేకుండా ఆలయ నిర్మాణం చేపట్టడంతో ఉద్దండరావును అప్పటి జాగీర్దార్లు చెరసాలలో పెట్టారు. అయితే చెరసాలలో ఉన్న ఉద్దండరావు సంకెళ్లు రామస్వామి మహిమ వల్ల ఊడి పోవడాన్ని జాగిర్దార్లు గుర్తించి ఆయనను విడుదల చేశారు. అప్పటి నుంచి జుంటుపల్లి రామస్వామి ఆలయ నిర్మాణానికి అవసరమైనా చర్యలను పునఃప్రారంభించి అందరి మన్ననలను ఆయన పొందాడు. అయితే ఈ ఆలయ సమీపంలో ఉన్న దోనే కూడా ఎంతో పేరు కలిగింది.

దోనే ప్రాశస్త్యం ఏమిటంటే..

శ్రీరాముడు జైత్ర యాత్రల్లో భాగంగా ఈ దేవాలయ సమీపంలో బస చేసినట్లు పూర్వీకులు చెబుతుంటారు. ఇక్కడ బస చేసినప్పుడు సీతాదేవి స్నానమాచరించడానికి దరిదాపుల్లో ఎలాంటి నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని శ్రీరాముడు గుర్తించాడు. ఆ సమయంలో శ్రీరాముడు తన బాణంతో అక్కడి కొండలపై ఉన్న పెద్ద బండరాయిని చీల్చాడు. దీంతో బండరాయి రెండుగా చీలిపోయి, అందులోంచి నీటి ధార బయటకు వచ్చింది. అప్పుడు అక్కడ సీతాదేవి స్నానమాచరించినట్లు ఇక్కడి వారు చెబుతుంటారు. దీనినే దోనేగా ఇక్కడి వారు పిలుస్తుంటారు. ఈ దోనేలో నీరు ఎప్పుడూ ఉంటుంది. భక్తులు ఇక్కడే స్నానమాచరిస్తారు. ఈ దోనేలో స్నానమాచరిస్తే సుఖ సంతోషాలతో పాటు సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



రామస్వామి కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైనా చర్యలు తీసుకుంటున్నాం. భక్తులకు తాగు నీరు, ఉండడానికి వసతి, శాంతి భద్రతల కోసం పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశాం.

– నాగేశ్వరరావు, ఆలయ చైర్మన్

రైతు పక్షపాతి కేసీఆర్

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: దేశానికే తెలంగాణ రాష్ట్రం దిక్సూచిలా మారిందని, యావత్ దేశం తెలంగాణ వైపు చూస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని అత్తాపూర్, అక్నాపూర్, పూలపల్లి, నారెగూడ, గంగ్యాడ, గుబ్బడిపత్తేపూర్, ముబారక్‌పూర్, గొల్లగూడ, లింగంపల్లి, ఎల్లకొండ, మైతాప్‌ఖాన్‌గూడ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో గంగ్యాడ సర్పంచ్ గోవిందమ్మ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రైతు బీమా, రైతు బంధు, 24 గంటల కరెంటు, పింఛన్లు, మిషన్ భగీరథ, కంటి వెలుగు పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. ప్రధాన మంత్రి సొంత రాష్ట్రంలో కూడా తెలంగాణ లాంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. సీఎం కేసీఆర్ పేదలు, రైతు పక్షపాతి అన్నారు. అందుకే సమాన్యులు, రైతులకు కావాల్సిన అన్ని పథకాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ చొరవతో చేవెళ్ల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు షాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్, శంకర్‌పల్లిలో రైల్వే కోచ్ సెంటర్, నవాబుపేటలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్, ఇతర ఐటీ కంపెనీలు రావడంతో ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు అజయ్‌కుమార్, నర్సింహారెడ్డి, పర్మయ్య, విర్జినమ్మ, బాలమణి, నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, అనిత, ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు సీ మల్లారెడ్డి, రంగారెడ్డి, ఆనంద్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, శాంతకుమార్, రాజశేకర్‌రెడ్డి, రాంచంద్రరెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చించల్‌పేటలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు

నవాబుపేట: గత పాలకుల నిర్లక్ష్యంతో అన్ని రంగాల్లో వెనబడిన నవాబుపేట మండలాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని చించల్‌పేట గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి, రూ.10 లక్షల డ్వాక్రా భవనానికి, రూ.20 లక్షల బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవాబుపేట మండలం హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. నేను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మంత్రి సబితారెడ్డి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. మండలంలోని మూసీనదిపై రెండు బ్రిడ్జిలు, మైసమ్మ ఆలయం నుంచి నవాబుపేట వరకు బీటీ రోడ్డు, చించల్‌పేట నుంచి నారెగూడ వరకు బీటీ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకు కలిపి ప్రస్తుతం రూ.50 కోట్ల మేర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాలె భవానీ, జెడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైనర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు అజయ్‌కుమార్, చించల్‌పే సర్పంచ్ శ్రీనివాస్, సర్పంచ్‌లు రత్నం, సుధాకర్‌రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మల్లారెడ్డి, క్రిష్టారెడ్డి, మాణయ్య, చిట్టయ్య, అనంత్‌రెడ్డి, దేవయ్య తదిరతరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొంరాస్‌పేట: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ పి.శంకర్ తెలిపారు. మండలంలోని కొత్తూరు, వడిచర్ల శివార్లలో యాలాల మండలం దేవనూరుకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసు పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ శాఖకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

జాతరకు భారీ బందోబస్తు

సీఐ రాంబాబు



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

యాలాల: ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్న జుంటుపల్లి సీతారామస్వామి జాతర ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తాండూరు రూరల్ సీఐ రాంబాబు అన్నారు. ఉత్సవాలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను ఆదివారం యాలాల ఎస్ఐ అరవింద్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆలయ కమిటీని ఆదేశించారు. వందల సంఖ్యలో జాతరకు తరలివచ్చే భక్తులకు ఆలయానికి వచ్చే దారుల్లో వాహనాల రాకపోకలకు అనుమతి లేదన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. వారి వెంట ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, హన్మంత్‌రావు తదితరులు ఉన్నారు.

శభాష్.. ఐశ్వర్య

పరిగి: ఆగాఖాన్ అకాడమీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో శతక, భాగవత పద్యాలతో 'పద్య ప్రస్థానం పద్య పఠన' రాష్ట్రస్థాయి పోటీల్లో పరిగి విద్యార్థిని ద్వితీయ బహుమతి సాధించింది. పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఐశ్వర్య ఇటీవల రావిర్యాలలో నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. అందులో అనర్గళంగా రాగయుక్తంగా, కంఠస్థంగా పాడినందుకు గాను నిర్వాహకులు ద్వితీయ బహుమతికి ఎంపికచేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్నేహలత, ఉపాధ్యాయులు ఆమెను ఆదివారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు గెలవాలని ఆకాంక్షించారు.



బహుమతి అందుకుంటున్న ఐశ్వర్య

పేదోడి 'ఫ్రిజ్'కు ఆదరణ కరువు

రోజురోజుకు తగ్గిపోతున్న మట్టికుండల విక్రయాలు

- పనులు లేక వలసబాట పడుతున్న వృత్తిదారులు

దౌల్తాబాద్: ఆధునిక పోకడలు కులవృత్తుల పాలిట శాపంగా మారాయి. ప్రస్తుతం కులవృత్తులు ఆదరణకు నోచుకోకపోవడంతో వృత్తిదారులు గ్రామాలను వదిలి వలసబాట పడుతున్నారు. ఆధునిక పరికరాలు, ఫ్రిజ్‌లు వంటివి రావడంతో మట్టికుండల(పేదోడి ఫ్రిజ్)కు ఆదరణ తగ్గింది. ఒకప్పుడు ఏ గ్రామంలో చూసినా దాదాపు పదిమంది వరకు కుండల తయారీదారులు ఉండేవారు. వారు కుండలు తయారుచేసి విక్రయిస్తూ జీవనం గడిపేవారు. ప్రజలువాటిని వంట పాత్రలుగా, మంచినీటికి, పెళ్లిళ్లు, ఫంక్షన్లకు వినియోగించడంతో ఆదరణ బాగుండేది. కాలక్రమంలో ప్రజలు కరెంట్ కుక్కర్లు, స్టీల్, కాపర్, నాన్‌స్టిక్ పాత్రలను వాడుతుండటంతో మట్టిపాత్రలకు ఆదరణ తగ్గింది. ఎండాకాలం వచ్చిందంటే మట్టికుండలకు ఆదరణ బాగా ఉండేది. కాగా ప్రస్తుతం మట్టికుండ 100 రూపాయల నుంచి 150రూపాయల వరకు అమ్ముతున్నారు. అయితే విచ్చలవిడిగా మార్కెట్‌లోకి ఫ్రిజ్‌లు రావడంతో కుండలకు ఆదరణ తగ్గుతుంది.



మట్టికుండలతో ఆరోగ్యం

మట్టికుండలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పాత్రలో ఆహార పదార్థాలను ఉడికిస్తే అదనపు ఫ్యాట్లు ఉండవు.ఆహార పదార్థాలను మట్టిపాత్రలో ఉంచడంతో చెడిపోకుండా ఎక్కువ సమయం ఉంటాయి. ఇందులో వండిన ఆహారం రుచిగా ఉండటంతో పాటు అధిక పోషకాలు అందుతాయి. వేసవి వచ్చిందంటే ఈ మట్టికుండలకు మంచి ఆదరణ ఉండాలి. ఈ కుండల్లో నీరుతాగితే ఉపశమనం ఉంటుంది. కానీ ఫ్రిజ్‌ల నీటికి అలవాటు పడ్డ వారు కుండల నీళ్లు తాగేందుకు ఇష్టపడటం లేదు. ప్రభుత్వం ప్రోత్సాహం అందించి ఆదుకోవాలని వృత్తిదారులు కోరుతున్నారు.

బీజేపీ కుట్రలను ఎండగడదాం

కొందుర్గు: దేశంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే రాహుల్‌గాం. దీపై కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని రాంచంద్రాపూర్‌లో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ పట్ల బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కుట్రలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ సంస్థలకు ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టి దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రశ్నించడం వల్లే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు నర్సింహ, శ్రీనునాయక్, మహేందర్‌రెడ్డి, షబ్బీర్, సయ్యద్ నయూమ్, ఆదిల్, సలీం, హమీద్, బేరాన్, మహ్మద్, రాజేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

బషీరాబాద్: భార్యతో గొడవ పడిన భర్త కొద్ది సేటికే ఆత్మహత్య చేసుకున్న సంఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం నాగులపల్లికి చెందిన నరేష్‌కు జీవన్గి గ్రామానికి చెందిన మౌనికతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే భార్యభర్తలు తరుచూ గొడవలు పడేవారు. అనేక సార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినట్లు తెలిసింది. శనివారం రాత్రి కూడా గొడవ పడ్డారు. దీంతో భార్య మౌనిక తన పిల్లలతో కలిసి బయటకు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న నరేష్ ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకుది ఆత్మహత్య కాదని హత్యేనని నరేష్ తల్లి సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

నవాబుపేట: మండలంలోని పులుమామిడిలో శివపార్వతులు, రుక్మిణి విఠలేశ్వర, సుబ్రహ్మణ్య, నవగ్రహ, సీతా రామాంజనేయ స్వాముల సప్తమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘన ంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి అలంకరణ, అభిషేకం, గణపతి పూజ, సర్వదేవతలకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజలో సర్పంచు విమల, ఎంపీటీసీ తేజస్వి పాల్గొన్నారు.



స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

పంచాయతీలకు అవార్డుల ప్రదానం

మోమిన్‌పేట: జాతీయ పంచాయితీ రాజ్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా మండలానికి చెందిన గోవిందాపూర్, ఏన్కతల, చీమల్‌దరి గ్రామ పంచాయతీలకు జిల్లా ఉత్తమ అవార్డులు దక్కాయి. ఈ మేరకు శనివారం మంత్రి సబితారెడ్డి, కలెక్టరు నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు అవార్డులను అందుకున్నారు. సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, అలివేలమ్మ, ఆశమ్మ, కార్యదర్శులు సుగుణ, మైపాల్‌రెడ్డి, ఫిరోజ్‌ఖాన్ అవార్డులు అందుకున్నారు. అందరి కృషితోనే ఇది సాధ్యమైందని ఎంపీడీఓ శైలజారెడ్డి పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ నర్సింహారెడ్డి

జిల్లా ఉత్తమ వైద్య ఉద్యోగిగా జ్యోతి



ఉత్తమ సేవ అవార్డును అందుకుంటున్న టీబీహెచ్‌వీ జ్యోతి

ఇబ్రహీంపట్నం: క్షయ రోగులకు ఉత్తమ సేవలందించిన ఇబ్రహీంపట్నం డివిజన్ టీబీ హెచ్‌వీ ఉద్యోగి ఎం జ్యోతిని జిల్లాస్థాయి అవార్డు వరించింది. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కామినేని ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా టీబీ అధికారి డా. అరుణకుమారి చేతుల మీదుగా జ్యోతి ఉత్తమ సేవ అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకునేందుకు వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందించడం, ఈ వ్యాధి నివారణపై అవగాహన కల్పించడంలో ఆమె కీలకపాత్రను పోషించింది.

అవార్డు బాధ్యతను పెంచింది

జిల్లాస్థాయి అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందని జ్యోతి అన్నారు. విధి నిర్వహణలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సూత్రాలు వివరించా. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి సులువుగా నయం అవుతుందన్న వివరించా. అవార్డుకు ఎంపిక చేసిన జిల్లా అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ట్రస్మా'ను శక్తివంతంగా మారుస్తాం

రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు

ఆమనగల్లు: ట్రస్మా(ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్)ను మరింత శక్తివంతంగా మారుస్తామని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ప్రకటించారు. ట్రస్మా బైలాస్‌లో మార్పులు చేర్పులు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆమనగల్లులోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో ఆదివారం ట్రస్మా రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి రమణారావ్, రాష్ట్ర ప్రతినిధులు, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో ట్రస్మా బైలాస్‌లో నూతనంగా పొందుపరిచిన అంశాల గురించి చర్చించి ఆమోదించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావ్ మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం ఏర్పడిన ట్రస్మాలో ప్రస్తుతం 32జిల్లాల నుంచి 9వేల బడ్జెట్ పాఠశాలలు సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. ప్రస్తుతం బడ్జెట్ పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆయన చెప్పారు. వాటిని కాపాడుకోవడానికి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా అనేక ప్రైవేటు పాఠశాలలు మూతపడ్డాయని, మరికొన్ని మనుగడ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయన్నారు. బడ్జెట్ పాఠశాలల మనుగడ కోసం ట్రస్మా బైలాస్‌లో మార్పులు చేర్పులు చేసినట్లు ఆయన చెప్పారు. ఎస్ఎస్‌సీ హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచడం సరైన నిర్ణయం కాదని, దీనివల్ల అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీరప్ప, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పరంజ్యోతి, నారాయణరెడ్డి, ఉమామహేశ్వర్, జోసఫ్, సీ అల్లాజీగౌడ్, టీ వెంకటయ్య, సువర్ణ, గోవర్ధన్‌రెడ్డి, ఏ నిరంజన్, శ్రీనివాసులు, జీ శ్రీనివాసులు, మహమూద్, శ్రీనివాస్, కోట్ల వెంకటేశ్, శ్రీనివాస్‌గుప్తా, సంజీవ్‌కుమార్, ఏ శివలింగం, చెన్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కొత్తూరు: ముందు వెళుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ రాములు, కండక్టర్ వేణుగోపాల్‌చారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిమ్మాపూర్ శివారులో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం మేరకు.. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వనపర్తి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. శనివారం రాత్రి తిమ్మాపూర్ శివారులోకి రాగానే అదే మార్గంలో ఐరన్ (ఇనుప చువ్వల)లోడ్‌తో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, కండక్టర్‌కు తీవ్ర గాయాలు కాగా పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



లారీని ఢీకొన్న బస్సు